sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 26-08-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 137 EDITOR: ROHINI



అందాల తారకు రాహుల్ అండ

కృతి సనన్ ఫ్యాషన్... రాహుల్ పరేషాన్

రాఖీ పండుగ వేళ బాలీవుడ్ ప్రముఖ నటి కృతి సనన్ ధరించిన దుస్తులపై చెలరేగిన వివాదం రాజకీయంగా కొత్త మలుపులు తిరిగింది. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించడం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, వస్త్రధారణపై జరుగుతున్న రచ్చపై ఆయన బహిరంగంగా మద్దతు ప్రకటించారు.

- సహనం వందే, న్యూఢిల్లీ

- బాలీవుడ్ భామ రాఖీ దుస్తులపై రచ్చ
- సోషల్ మీడియా ట్రోలింగ్... కంగనా ఫైరింగ్
- రాహుల్ మద్దతుతో రగులుతున్న వివాదం
- రాజకీయాలను తాకిన బాలీవుడ్ ఫ్యాషన్

రాఖీ పండుగ సమీపిస్తున్న తరుణంలో ప్రముఖ నటి కృతి సనన్ నటించిన ఒక జ్యువెల్లరీ ప్రకటన సోషల్ మీడియాలో తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ క్యాంపెయిన్‌లో కృతి సనన్ ఇండో-వెస్ట్రన్ దుస్తులు ధరించి తన సోదరిడికి రాఖీ కడుతున్నట్లు చూపించారు. ఆమె ధరించిన బ్రాలెట్-స్టైల్ బ్లౌజ్, కేప్, డ్రాప్డ్ స్కర్ట్ డిజైన్‌పై కొందరు నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాఖీ పండగ పవిత్రతకు ఈ రకమైన దుస్తులు సరిపడవని, సంప్రదాయానికి విరుద్ధంగా ఉన్నాయని విమర్శలు గుప్పించారు.

కృతి సనేన్ ఘాటు స్పందన

ఈ ప్రకటనపై దుమారం రేగడంతో నటి కృతి సనేన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. మహిళల సంస్కృతిని, గౌరవాన్ని కేవలం వారు ధరించే బట్టల ద్వారానే అంచనా వేసే విధానం ఎప్పుడు మారుతుందని ఆమె ప్రశ్నించారు. పండగల అసలు సారం మనం వేసుకునే దుస్తుల్లో ఉండదని, మన హృదయంలో ఉండే సంప్రదాయాలు, అనుబంధాలలో ఉంటుందని స్పష్టం చేశారు. తన సోదరితో కలిసి తాము కూడా రాఖీ పండుగను జరుపుకుంటామని, తోబుట్టువుల మధ్య బంధానికి బట్టలతో సంబంధం లేదని కృతి తేల్చిచెప్పేశారు.

రాహుల్ గాంధీ బహిరంగ మద్దతు

కృతి సనేన్ చేసిన ఈ వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బహిరంగంగా మద్దతు ప్రకటించారు. మహిళలు ఏ దుస్తులు ధరించాలి, ఎక్కడికి వెళ్లాలి, ఏం చేయాలి అనేది పూర్తిగా వారి వ్యక్తిగత ఆప్షన్ అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. మహిళలు తమ వ్యక్తిగత స్వేచ్ఛను ఆస్వాదిస్తున్నప్పుడు వారిని సోషల్ మీడియాలో అకారణంగా ట్రోల్ చేయడం ఆపేయాలని ఆయన హితవు పలికారు. ఈ మేరకు ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్ట్ ప్రస్తుతం రాజకీయంగా, సామాజికంగా హాట్ టాపిక్‌గా మారింది.

కంగనా రనౌత్ తీవ్ర విమర్శలు

మరోవైపు ఈ వివాదంలో నటి కృతి సనన్‌పై బీజేపీ ఎంపీ, ప్రముఖ నటి కంగనా రనౌత్ తీవ్రంగా మండిపడ్డారు. నేటి ఆధునిక కాలంలో మహిళలకు రకరకాల దుస్తులు ధరించే స్వేచ్ఛ ఉందని, గ్లోబల్ ఉమెన్‌గా మారామని కంగనా అంగీకరించారు. అయితే కాక్టెయిల్ డ్రెస్సులు, చీరలు, సల్వార్ కమీజ్ వంటి ఎన్నో సంప్రదాయ దుస్తులు అందుబాటులో ఉన్నప్పుడు, సొంత అన్నదమ్ములకు రాఖీ కట్టే సమయంలో ఇలాంటి బ్రాలెట్ లేదా అండర్‌గ్రామెంట్స్ తరహా దుస్తులు ఎందుకు ధరించాలని ఆమె ప్రశ్నించారు. అసలు ఈ యాడ్ డిజైన్ చేయడంలో ఉద్దేశం ఏంటని, ఇది చూడటానికి ఎంతో ఇబ్బందికరంగా ఉందని ఆమె ఆక్షేపించారు.

సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన

సోషల్ మీడియాలో కూడా ఈ ప్రకటనపై మిశ్రమ స్పందన లభిస్తోంది. కొందరు నెటిజన్లు కృతి సనన్ ధరించిన దుస్తులు పండగ వాతావరణానికి తగినట్లుగా లేవని, పూజా థాలీ లేకుండా రాఖీ పండగను ఎలా ప్రదర్శిస్తారని విమర్శించారు. మరికొందరు మాత్రం ఫ్యాషన్ ఎప్పుడూ మారుతూ ఉంటుందని, మహిళల వస్త్రధారణను తప్పుపట్టడం మానుకోవాలని కృతికి మద్దతుగా నిలిచారు. సాంప్రదాయ ఫ్యాషన్ మారుతున్న కొద్దీ దాన్ని స్వీకరించే మనస్తత్వం కూడా మారాలని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

వ్యక్తిగత స్వేచ్ఛపై నైతిక చర్చ

ఈ ఉదంతం మరోసారి మన సమాజంలో మహిళల వస్త్రధారణ, వ్యక్తిగత స్వేచ్ఛపై జరుగుతున్న నైతిక చర్చలను తెరపైకి తెచ్చింది. కాలం మారుతున్నా, ఫ్యాషన్ రంగం ఎంతగా అభివృద్ధి చెందుతున్నా మహిళల ఎంపికలను సమాజం ఒక కంట కనిపెడుతూనే ఉందనే వాదన బలపడుతోంది. సంప్రదాయాలు అనేవి మనుషుల ప్రవర్తనలో ఉండాలి కానీ వారు ధరించే బట్టల్లో ఉండదనే వాదనను అనేక మంది ప్రముఖులు సమర్థిస్తున్నారు. పండగల పవిత్రతను కాపాడటంతో పాటు వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించడం ఎంత ముఖ్యమో ఈ వివాదం మరోసారి గుర్తు చేసింది.

బిచ్చగాడు... ఇక కానరాడు

జనాభా లెక్కల్లో బిచ్చగాళ్లు ఔట్

- ఆ కేటగిరీని ఎత్తివేసిన కేంద్ర ప్రభుత్వం
- కొత్తగా తల్లిదండ్రుల వివరాల నమోదు
- మత మార్పిడుల చరిత్ర తెలుసుకునే యత్నం
- ఫోన్ నెంబర్, ఆధార్ డీటేల్స్ తప్పనిసరి
- వలసల కేటగిరీలో ప్రకృతి వైపరీత్యాలు



దేశంలో కోట్ల మంది జనాభా ఉన్నప్పటికీ ఎప్పుడూ కనిపించని విచిత్రమైన కోణం ఒకటి ఉంది. రాబోయే 2027 సెన్సస్ నుంచి భిక్షాటన కేటగిరీని పూర్తిగా తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు జనాభా లెక్కల్లో ప్రత్యేకంగా నమోదు చేసిన ఈ వర్గం ఇకపై అధికారిక గణాంకాల్లో కనిపించదు. ఈ మార్పు వెనుక ఉన్న అసలు కారణాలు ఇక్కడ చూద్దాం. **- సహనం వందే, హైదరాబాద్**

చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా రాబోయే 2027 సెన్సస్ కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు జరిగిన ప్రతి జనాభా లెక్కల్లో దేశంలో భిక్షాటన చేసేవాళ్లను, నిరాశ్రయులను ప్రత్యేకంగా గుర్తించేవాళ్ళు. కానీ ఈసారి విడుదల చేసిన ప్రశ్నావళి నుంచి ఆ కేటగిరీని పూర్తిగా తొలగించారు. నాన్-ఎకనామిక్ యాక్టివిటీ జాబితాలో గతంలో ఉన్న బెగ్గర్స్ అండ్ వాగ్రెంట్స్ అనే ఆప్షన్ ఇప్పుడు కనిపించదు. దీనివల్ల దేశంలో అసలు ఎంతమంది భిక్షాటన మీద బతుకుతున్నారు అనే కచ్చితమైన సంఖ్య ఇకపై సెన్సస్ టేబుల్స్‌లో ఎక్కడా కనిపించదు.

తక్కువ రెస్పాన్స్ వల్లే...

ఇలా ఈ కేటగిరీని తొలగించడానికి ప్రధానంగా గత లెక్కల్లో వచ్చిన అతి తక్కువ రెస్పాన్సే కారణమని తెలుస్తోంది. 2011లో జరిగిన జనగణన లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా కేవలం 3.8 లక్షల మంది మాత్రమే తమను తాము బెగ్గర్స్ లేదా వాగ్రెంట్స్‌గా ప్రకటించుకున్నారు. అంతకుముందు 2001లో 6.3 లక్షల మంది, 1991లో దాదాపు 5.4 లక్షల మంది మాత్రమే ఈ జాబితాలో నమోదయ్యారు. ఇన్ని కోట్ల జనాభా ఉన్న దేశంలో ఈ సంఖ్య అసలు వాస్తవ పరిస్థితికి చాలా దూరంగా ఉందని అధికారులు భావించారు. అవమానం లేదా భయం కారణంగా చాలామంది తాము బిక్షాటన చేస్తున్నట్లు బహిరంగంగా చెప్పడానికి ఇష్టపడలేదని అధికారులు చెబుతున్నారు.

ఎన్యుమరేటర్ల సరికొత్త పద్ధతి

సెన్సస్ నిబంధనల ప్రకారం జనాభా లెక్కలు సేకరించే అధికారి ఎల్లప్పుడూ ప్రతివాది స్వయంగా చెప్పిన వృత్తిని లేదా సమాచారాన్ని మాత్రమే నమోదు చేయాలి. ప్రజలు తమ నిజమైన స్థితిని చెప్పడానికి వెనుకాడటం వల్లే గతంలో ఈ డేటా ఎప్పుడూ సరిగా రాలేదు. అందుకే ఇకపై ఈ ప్రత్యేక వర్గాన్ని విడివిడిగా గుర్తించడం మానేసి అందరిలాగే వారిని కూడా ఇతరులు లేదా అదర్స్ కేటగిరీ కింద కలపాలని నిర్ణయించారు. దీనివల్ల ఇకపై భిక్షాటన చేసే వాళ్ల సంఖ్య తెలిసే అవకాశం లేదు. దీన్ని ఆధారం చేసుకుని దేశంలో బిచ్చగాళ్లే లేరని ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే అవకాశం లేకపోలేదని కొందరు విమర్శిస్తున్నారు.

వలసల్లో ప్రకృతి వైపరీత్యాలు

అయితే ఈసారి జనాభా లెక్కల్లో కీలకమైన మార్పులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ముఖ్యంగా వలసలకు సంబంధించిన కారణాలలో ఈసారి సరికొత్తగా ప్రకృతి వైపరీత్యాలు అనే ఆప్షన్ చేర్చారు. ఇప్పటివరకు పని, వ్యాపారం, చదువు, పెళ్లి, లేదా కుటుంబంతో పాటు వెళ్లడం వంటి కారణాలను మాత్రమే రికార్డు చేసేవారు. కానీ ఇప్పుడు మారుతున్న కాలానికి తగినట్టుగా వరదలు, తుఫానులు, భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎంతోమంది ప్రజలు తమ స్వస్థలాలను వదిలి వలస వెళ్లవలసి వస్తున్న వాస్తవాన్ని కూడా ఈ గణనలో స్పష్టంగా రికార్డు చేయనున్నారు.

తల్లిదండ్రుల వివరాల సేకరణ

అలాగే ఈసారి సెన్సస్ ఫారమ్‌లో తల్లిదండ్రులకు సంబంధించిన వివరాలను సేకరించడం మరొక ప్రత్యేకతగా నిలుస్తోంది. ప్రతి ఒక్కరి ఫారమ్ లో తల్లి, తండ్రి పుట్టిన తేదీ, పుట్టిన స్థలం అలాగే వారి మతం వివరాలను సేకరించేలా కొత్త కాలమ్స్ పెట్టారు. అయితే ఇక్కడ ప్రజలు ఒక ముఖ్యమైన విషయం గమనించాలి. ఈ వివరాలు ప్రతి ఒక్కరు నింపాల్సిన అవసరం లేదు. ఎప్పుడైతే తల్లిదండ్రులు వేరుగా ఉంటారో లేదా వారు ఇప్పటికే జీవించి లేకపోతే మాత్రమే ఈ ప్రత్యేక వివరాలను పూరించాల్సి ఉంటుంది. దీని ద్వారా తరాల మధ్య మతాంతర వివాహాలు, మత మార్పిడుల చరిత్ర, పౌరసత్వ అర్హతల లెక్కలు బయటకు అవకాశం ఉంది.

మహా దండయాత్ర... మనోళ్ల నిద్రయాత్ర

కుళ్లిన రుచికి టీ-ఫుడ్ సేఫ్టీ అండదండలు

- మహారాష్ట్రలో రెస్టారెంట్లపై ఉక్కుపాదం
- పంజా విసురుతున్న ఐఏఎస్ తుకారం
- ఆహార సంస్థలు, హోటళ్ల గుండెల్లో రైళ్లు
- మరి తెలంగాణ అధికారులు ఏం చేస్తున్నట్టు?

ఎంతో ఇష్టంగా ఆర్డర్ చేసి తినే బిర్యానీ ప్లేట్ కింద ఎంతటి మురికి రహస్యం దాగి ఉంటుందో ఎప్పుడైనా ఆలోచించారా? మహారాష్ట్రలో అధికారులు కఠిన చర్యలు తీసుకుంటుంటే తెలంగాణలో మాత్రం నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. ఫేమస్ హోటళ్లు, బిర్యానీ పాయింట్లలో కుళ్లిన మాంసం, కల్తీ నూనెలు విరివిగా వాడుతున్నా అధికారుల్లో చలనం లేదు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా స్పందించని వైనంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. **- సహనం వందే, హైదరాబాద్/ముంబై**

మహారాష్ట్రలోని ముంబై నగరంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మరోసారి తమ పట్టు నిరూపించారు. ముంబైలో అత్యంత ప్రసిద్ధి చెందిన రెస్టారెంట్ల లైసెన్స్‌లను అధికారులు సస్పెండ్ చేస్తున్నారు. డైనమిక్ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ తుకారాం ముండే పర్యవేక్షణలో జరుగుతున్న ఈ మెరుపు దాడుల్లో ఉల్లంఘనలు బయటపడ్డాయి. తనిఖీల్లో గుడ్లను సాధారణ ఉష్ణోగ్రత వద్ద ఉంచడం, పచ్చి మాంసం, వండిన ఆహారం వేర్వేరుగా ఉంచకపోవడం వంటి దారుణాలు వెలుగు చూశాయి.

మహారాష్ట్ర అధికారుల కొరడా

మహారాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్, డైనమిక్ ఐఏఎస్ అధికారి తుకారాం ముండే ఆధ్వర్యంలో రెస్టారెంట్లపై దాడులు జరుగుతున్నాయి. ఆ రాష్ట్రంలో కేవలం ఒక్క రోజులో 37 హోటళ్లు, దాబాలపై ఏకకాలంలో దాడులు చేశారు. 31 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేయగా, ముంబైలోని ప్రముఖ ఎంసీఏ, కేఫ్ కాడెల్, చైనా టౌన్ ఫాస్ట్ ఫుడ్ లైసెన్స్‌లు రద్దయ్యాయి. నాగపూర్‌లో బుర్హాన్పూర్ జలేబి సెంటర్, స్టెప్ ఇన్ రెస్టారెంట్ లైసెన్స్‌లు కూడా సస్పెండ్ అయ్యాయి. అలాగే అనుమతులు లేని వ్యాపారాలపై దాడులు చేసి వేల కిలోల ఆహార పదార్థాలు, కల్తీ సోయాబీన్ నూనె, కోట్ల విలువైన వక్కలను సీజ్ చేశారు.

తెలంగాణలో నామమాత్రపు తనిఖీలు

మహారాష్ట్రలో అధికారులు ఇలా రాత్రింబవళ్ళు కష్టపడి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుంటే తెలంగాణలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో ఎన్నో హోటళ్లు, రెస్టారెంట్లు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. కానీ మన ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎప్పుడో ఒకసారి నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఎక్కడో ఒకచోట చిన్న సోషల్ మీడియాలో హడావుడి చేయడం మినహా క్షేత్రస్థాయిలో పక్కా అమలు కనిపించడం లేదు.

గాలికి వదిలేసిన అధికారులు...

తెలంగాణలో ఎన్నో ఫేమస్ బిర్యానీ పాయింట్లు, హోటళ్లలో కుళ్ళిన మాంసం వాడుతున్నారనే వార్తలు తరచూ వస్తూనే ఉన్నాయి. కల్తీ నూనెలు, హానికరమైన రంగులు కలిపిన ఫుడ్ పార్శిళ్లు విరివిగా అమ్ముతున్నారు. కనీసం బేసిక్ హైజీన్ రూల్స్ పాటించని హోటళ్లపై కూడా మన అధికారులు నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్నారు. లైసెన్సులు రద్దు చేయడం, శాశ్వతంగా మూయించడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు చాలా తక్కువ. మహారాష్ట్రలో ఉన్నటువంటి నిబద్ధత, పట్టుదల మన రాష్ట్ర అధికారులలో ఎందుకు కనిపించదో ఎవరికీ అంతుచిక్కడం లేదు. మహారాష్ట్రలో తుకారాం ముండే లాంటి ఐఏఎస్ అధికారులు తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలు చూసైనా మన రాష్ట్ర అధికారులు బుద్ధి తెచ్చుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యల కోసం ఎదురుచూపులు

ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ శాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించాలి. రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి ప్రతి హోటల్, రెస్టారెంట్‌పై కొరడా రుళిపించాలి. తప్పు చేసిన వాడికి కఠినమైన శిక్ష పడేలా, లైసెన్స్ రద్దు చేసేలా నిబంధనలను కఠినతరం చేయాలి. అప్పుడే హోటళ్ల నిర్వాహకులలో భయం పుడుతుంది, ప్రజలకు సురక్షితమైన ఆహారం అందుతుంది. ప్రజలు కూడా కేవలం రుచిని చూసి మోసపోకుండా పరిసరాల పరిశుభ్రతను గమనించాలి. ఎక్కడైనా లోపాలు కనిపిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేసే ధైర్యం చేయాలి.